# పల్లె పిలిచింది

-విశ్వసాయి

"సారీ నాన్నా, రావటానికి కుదరదు. ఇక్కడ మేం క్షేమం. అక్కడ నువ్వు క్షేమమని తలుస్తాను"

ఇట్లు
నీ కొడుకు
శ్రీసాయి.

అన్న నాలుగు పొడిపొడి పదాల ఉత్తరాన్ని కనీసం అరడజను సార్లు చదివి వుంటాను. అయినా మనసు చావక, వాడితో పంచుకున్న అనురాగం, ఆప్యాయత, ప్రేమానురాగాల ఆనవాళ్ళు కోసం, నా కళ్ళు ఇంకా అందులో పిచ్చిపిచ్చిగా వెదుకుతూనే వున్నాయి. అవి అందులో ఎప్పటికీ అణుమాత్రమైనా కానరాకపోవడంతో కళ్ళు చెమర్చడం మొదలెట్టాయి.

మాకు లేకలేక కలిగిన సంతానం వాడు. అదీ ఉగాది రోజున. అందుకే క్షణం వాడిని విడిచి వుండలేక పోయే వాళ్లం. నిజానికి ఈ విషయంలో వాళ్లమ్మ కంటె నాకు గుండె దిటవు ఎక్కువ.

వాడు ఎం.బి.ఏ. చేస్తానని మొండికేశాడు. వాళ్లమ్మ వాడిని వదిలి ఉండలేనని అలిగింది. ఏడ్చింది. పిల్లల మీద పెంచుకున్న మమకారంతో, వాళ్లని విద్యాబుద్ధులకు దూరం చేయకూడదని ఆమెకి నచ్చజెప్పి, వాడిని ఆంధ్రా యూనివర్శిటీలో చేర్పించాను. ఆ తర్వాత కొద్ది నెలలకి వాడేదో ప్రమాదానికి గురై మరణించినట్టు కబురొచ్చింది. ఆ వార్తకి తట్టుకోలేని నా భార్య నిల్చున్న చోటే కుప్పకూలి నన్ను ఒంటరి వాడ్ని చేసి వెళ్లిపోయింది. చెప్పానుగా, నా గుండె గట్టిదని, ఆ షాక్‌లు నన్నేం చేయలేక బండగా మార్చాయి. వెనువెంటనే మరో కబురొచ్చింది. నా కొడుకు క్షేమంగానే ఉన్నాడని, వీడి పేరున్న మరో విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మరణించాడని. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాం అన్నారేగాని, నా ఈ చింతను తీర్చేదెవరు?

వాడికి ఎం.బి.ఎ. పూర్తికాగానే హైటెక్ సిటీలో విదేశీ కంపెనీలో మంచి ఉద్యోగం దొరికిందట. అట్నుంచటే రెక్కలు కట్టుకొని ఎగిరిపోయాడు, ఇక నా అవసరం లేదన్నట్టు. సంవత్సరానికి రెండ్రోజులు నా దగ్గర గడిపే ఆనవాయితీకి మాత్రం శ్రీకారం చుట్టాడు.

అక్కడే కోట్ల విలువ చేసే కోడల్ని సెలక్టు చేసుకొని, నువ్వు కాదనవన్న ఆశతోనే ఆమెకు మాటిచ్చానన్నాడు. పెళ్లయింది. వాడికో కూతురు పుట్టింది. నా భార్య పేరే 'లక్ష్మి' అని పెట్టుకున్నాడు.

పిల్ల పుట్టాక అసలు రావడం మానేశాడు. ఎప్పటిలాగే వాడి పుట్టిన రోజైన ఈ ఉగాదికి రమ్మని ఉత్తరం వ్రాశాను. దానికి జవాబే ఇది.

నాకా వయసు మళ్లుతోంది. నా అన్నవాడు, నాకున్నవాడు వాడొక్కడే కదా. వాడితో దరిదాపు ఇరవై ఏళ్ల అనుబంధం ఇరవై యుగాలుగా పాతుకుపోయింది. అందుకే వాడంటే ఆరాటం, నా వయసుతో బాటే పెరుగుతోంది. ఒంటరితనం భావం వల్లేమో, వాడిని చూసుకుంటూ, వాడి చెంతే బ్రతుకు ఈడ్చాలని గంపెడంత ఆశతో ఎదురు చూస్తున్నాను.

ఈ ఆలోచనలేవీ నన్ను స్థిమితంగా ఉండనివ్వడం లేదు. స్థిమితం లేని మనసు చేసే చేష్టలకి అర్థం పర్థం ఉండదు. అందుకే కాళ్లకి చక్రాలు కట్టుకున్నట్లు తోటల్లో, వీధుల్లో పచార్లు చేయించింది.

సాగర మథనంలో హాలాహలమే కాకుండా అమృతం కూడా దొరికినట్టు, ఆలోచించి ఆలోచించి మథనపడి, బాధపడ్డ నా మనసుకు ఓ చక్కటి పరిష్కారం దొరికింది. ఇన్నాళ్లు "నేను", "నాది" అనుకున్న భ్రమలు, అహం పటాపంచలయ్యాయి. ఇక మీంచి పండగకి పబ్బానికి, సెలవులకి, వాడిని రమ్మని సతాయించి, రాలేదని బాధపడే బదులు, నేనే వాడి దగ్గరికి పోతూ కొన్నాళ్లపాటు ఉండి రావాలన్న పరిష్కార మార్గం నాకు కొండంత ఊరటని, బలాన్ని ఇచ్చింది. వెంటనే వ్యవహారాలన్నీ చక్కబెట్టుకొని, ప్రక్కింటి పరంధామయ్య చెవిలో ఈ విషయం వేసాను.

"ఈ వసంత ఋతువులో పసిడి పల్లెను వదిలి ఆ కాంక్రీటు జంగిల్‌కి పోతానంటావేంట్రా? ఈ నవరాత్రులు పూర్తి కాని, అప్పుడు వెళ్లి నీ కిష్టమైనన్నాళ్లు ఉండి వద్దువుగాని" అని సలహా యిచ్చాడు.



చిన్న పిల్లాడిలా నిరాశచెంది ఏడుపు మొహం పెట్టాను.

"నిన్న మొన్న ఆకు రాల్చిన చెట్లు చిగుళ్లు పెట్టి పచ్చగా కళకళలాడుతున్నాయి. రంగు రంగుల పూలతో గుబాళిస్తున్నాయి. కమ్మని కోయిల గానాలు. ఏరువాకకి సిద్ధమవుతున్న పొలాలు, గలగలపారే కాలువ నీళ్ళు, చల్లని శీతగాలులు, ఇవేవీ పట్నంలో నీకు కానరావురా"

"అదీగాక, ఉగాది ఉదయాన్నే ఏరువాక పూజచేసి, సాగు ప్రారంభించాలి. తరవాత పంచాంగ శ్రవణం, ఆ వెంటనే వసంత నవరాత్రులకి అంకురార్పణ చేస్తూ దేవాలయంలో పూజలు. మనూళ్లో ఆ నవరాత్రుల కోలాహలం చూసి తీరాల్సిందే గాని చెప్పనలివి కాదు కదా. రాత్రిపూట ప్రత్యేక పూజలు, హరికథలు, రామాయణ మహాభారత పఠనాలు, ఇంకా ఆటలు, పాటలు, సాములు, తప్పెడు గుళ్లు, కోలాటాలు నీకు తెలీనివా చెప్పు".

''ఇవన్నీ నీకు పట్నంలో ఉంటాయనుకుంటున్నావా? ఉండవు. అందుకే పట్నంలో ఉగాది పండగ సంబరాలు జరుపుకోరు. ఏదో మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలంటూ కొన్ని సంస్థలు ఎక్కడో ఒకచోట కొన్ని కార్యక్రమాలని నిర్వహిస్తాయంతే" అన్నాడు పరంథామయ్య.

నా నిర్ణయంలో మార్పులేదని, రేపు ఉగాదనగా కొడుకు దగ్గరకు వెళ్లాను. కొడుకు కోడలు నన్ను బాగానే రిసీవ్ చేసుకున్నారు. మనవరాలిని చూసే వాళ్లెవరూ లేరని దాన్ని హాస్టల్‌లో చేర్పించారట. పది నిమిషాలు నాతో గడిపారో లేదో ఇద్దరూ ఉద్యోగాలకి బయల్దేరారు.

వారిని చూశానన్న ఆనందం ఎంతసేపో నిలవలేదు. ఉగాది రోజునే వాడి పుట్టిన రోజు కాబట్టి, ఆ రెండింటిని వేడుకగా జరిపించడానికి ఏయే కార్యక్రమాలు చేయాలో, ఎలా చేయాలో, చాలాసేపు చిన్న పిల్లాడిలా ప్లానులు వేసుకుంటూ కూర్చున్నాను. ఆ తర్వాత రాత్రి ప్రయాణబడలిక వల్ల బాగా నిద్రపట్టేసింది. కోడలిపిల్ల వచ్చి తలుపు కొడితేగాని తెలివిరాలేదు. వస్తూనే, "మావయ్యా, మీ అబ్బాయి ఆఫీసు పని మీద మధ్యాహ్నమే ముంబయ్ వెళ్లిపోయారు. నేనూ వెళ్లాల్సిందే, మీరున్నారని ఉండి పోయాను. నేను రేపుదయం ఫ్లయిట్‌కి వెళ్తున్నాను. రావడానికి నాలుగురోజులు పడుతుంది. మేం వచ్చే వరకూ మిమ్మల్ని ఉండమన్నారు" అంది.

నా ఆశల్ని కాలరాసినట్లయింది. నరనరాన నిర్లిప్తత చోటు చేసుకోవడంతో, కోడలితో ఏమీ చెప్పుకోలేక పోయాను. మౌనంగా, బాధగా గడిచిందా రాత్రి. తెల్లారింది. మామూలుగానే ఉంది. నేను కలలుగన్న ఉగాదిలా లేదు.

"అమ్మాయ్, ఉగాది పచ్చడి చేశావా?'' అడిగాను.

"అవునండి, ఏవేవో తెచ్చి చేసుకుంటార్టగా. చూస్తూనే ఉన్నారుగా, నాకంత తీరికా లేదు ఓపికలేదు. ఉండండి" అంటూ కంప్యూటర్ దగ్గరకి వెళ్లి ఏవేవో నొక్కి ఉగాది పచ్చడికి ఆర్డరిచ్చింది.

అంతే అరగంట గడవకముందే తెలుగింటి ఆడబిడ్డ వెండి రేకుల పొట్లాంతో ఎదుట నిల్చింది. తలో చెంచా పచ్చడి చేతిలో వేసి దగ్గరుండి నాకించి వందరూపాయలు బిల్లు చేసింది.

"అంతెందుకమ్మా" అన్నాను విస్తుపోయి.

"ఇక్కడంతే మావయ్యా, మొక్క మోడు ఇక్కడ వుండవుగా, అన్నీ బయట్నుంచి తెచ్చుకోవల్సిందేగా, అందుకే అంత కాస్టు" అంది కోడలు.

కోడలు కూడా బయల్దేరుతూ, నాకు క్రింద సెల్లార్‌లో, అన్ని హంగులతో వున్న గదిని ఏర్పాటుచేసింది. ముసలాడ్ని గదా, ప్రతీదానికి, మెట్లు ఎక్కి దిగితే మోకాలి చిప్పలు అరిగిపోతాయట. ఠంచనుగా కాఫీ, టిఫిన్, భోజనం రూంకే పంపే ఏర్పాటు చేసింది. "క్షమించండి మావయ్యా, మాకు అనుకోని ఆఫీసు పనులు తగలడంతో మేం ఉండలేక పోతున్నాం. ఎంత నాల్రోజులేగా, ఈలోగా మొత్తం సిటీ అంతా చుట్టు ముట్టేయండి. అలాగే బోరు కొట్టేటప్పుడు ఈ అపార్టుమెంటు పై అంతస్తుకు వెళ్లి చూస్తే మొత్తం సిటీ అంతా కనపడుతుంది. చాలా అందంగా ఉంటుంది కూడా" అంటూ కారెక్కేసింది.

ఏం చేయాలో పాలుపోక దిక్కులు చూస్తూ నిల్చుండిపోయాను. ప్రతీవాడు బిజియే. ప్రక్కవాడిని పట్టించుకునే స్థితిలో ఎవరూ లేరు. ఇక్కడకొచ్చి చాలా పొరపాటు చేశాననిపించింది. ఈలోగా ఒక విమానం ఆకాశంలో చక్కర్లు కొడుతుంటే, నా కోడలు అందులోగాని వెళ్తుందేమోనని, లిఫ్ట్‌లో పై అంతస్తు కెళ్లాను.

చుట్టూరా ఆకాశన్నంటుకుంటున్న హర్మ్యాలు. మధ్యలో కొండ చిలువల్లా నల్లని రోడ్లు. వాటిపై చీమల బారుల్లా వాహనాలు. వాటినుండి పై కెగసివస్తోన్న కాలుష్యపు పొగలు. పుట్ట నుండి బయటికి వచ్చి వడివడిగా పోతున్న చీమల్లా ప్రజలు. అదీ వెగటు పుట్టించే సిటీ అందం.

వసంతాన్ని నింపుకొని, వాత్సల్యాన్ని పంచి యిస్తున్న నా పల్లె జ్ఞప్తికి రాగానే అక్కడ ఉండాలనిపించలేదు. క్రిందకి దిగి ఆ గది తలుపుపై ఇలా రాసి బయల్దేరాను. ■

"ఉగాది శుభాకాంక్షలు"

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.